## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నాంపల్లి: టాటా టెలీ సర్వీస్ 11వ కేవీ ఫీడర్ పబ్లిక్‌గార్డెన్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు సైఫాబాద్ ఏడీఈ వినోద్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు డీజీపీ ఆఫీస్, ఇంటిలిజెన్స్ ఆఫీస్, హైదరాబాద్ కలెక్టరేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు తామెప్పుడు సిద్ధంగా ఉంటామని మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బీవీకే మూర్తి అన్నారు. ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు, వ్యాపారులు, విద్యార్థులు, కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల నాయకుల కోసం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారు 99592 26133 నంబర్‌లో తనను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను పరిశీలించి దానికి అనుగుణంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బీఆర్ఎస్ హయాంలోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి



ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, మనోహర్ గైక్వాడ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్, శ్రీనివాస్ ఆమె ను కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడు తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. తాను పార్టీ కార్యకర్తలకు, నా యకులకు అండగా ఉంటు వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

## రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీరెడ్డి కన్నుమూత



లక్ష్మీరెడ్డి (ఫైల్)

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ లక్ష్మీరెడ్డి (93) ఆదివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుమారు 39 సంవత్సరాల సుదీర్ఘ బోధన ప్రయాణంలో ఎందరో ఉన్నతాధికారులు, నటులు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఈమె విద్యార్థులే కావడం విశేషం. ఆమె మృతిపట్ల పలువురు ప్రముఖులతో పాటు నిజాం కళాశాల అల్యూమినీ సంతాపం వ్యక్తం చేసింది. ఒక మంచి ప్రొఫెసర్‌ను కోల్పోవడం ఎంతో బాధాకరమని వారు పేర్కొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం



అజయ్‌సింగ్ యాదవ్‌ను సత్కరిస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్ అన్నారు. తెలంగాణతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నాయన్నారు. ఆదివారం నగరానికి వచ్చిన ఆయనను ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సందర్భంగా అజయ్‌సింగ్ యాదవ్ మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాలు, మైనార్టీ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు.

# పాతబస్తీలో జోరుగా మెట్రో పనులు

- పనులను ఆపాలంటూ హైకోర్టులో పిల్
- పురాతన కట్టడాలకు ఆటంకాలు కలిగే అవకాశం
- తదుపరి విచారణ ఈ నెల 17 కు వాయిదా వేసిన హైకోర్టు
- సీఎం ఆదేశాల మేరకు...చకచకా కూల్చివేతలు
- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు వేగంగా మెట్రో పనులు



చార్మినార్: పాతబస్తీలో మెట్రో పనుల్లో వేగం పెరిగింది. దారుషిఫా నుంచి మొఘల్‌పురా వరకు ప్రధాన రోడ్డులోని ఇరువైపుల పురాతన కట్టడాలను సైతం తొలగిస్తున్నారు. ప్రస్తుతం నిరంతరాయంగా ఈ కూల్చివేతల పనులు కొనసాగుతున్నాయి. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతబస్తీలో మెట్రో పనులు ప్రారంభమవుతాయని కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన హామి మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉండి వెంటనే పనులను ప్రారంభించాలని మెట్రో ఎండీకి చెప్పడం.. పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరగడం.. నిధులను కేటాయించడం.. శంకుస్థాపన చేయడంతో కూల్చివేతలు చకచకా జరిగిపోతున్నాయి. దీనికి తోడు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో పాటు మజిస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీలు కూడా పాతబస్తీలో మెట్రో రైలు పనులను వెంటనే చేపట్టాలని కోరడంతో రోడ్డు విస్తరణ పనులు మొదలై జోరుగా కొనసాగుతున్నాయి.

### పురాతన కట్టడాలకు నష్టం కలుగుతుందంటూ పిల్..

దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టిన కూల్చితలలో చరిత్రాత్మకమైన కట్టడాలున్నాయని.. మెట్రో కూల్చివేతలతో వాటికి ముప్పు వాటిల్లనుందని.. వాటిని పరిరక్షించిన అనంతరమే కూల్చివేతలు కొనసాగించాలని కోరుతూ ఆక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్(ఏపీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది.

- చార్మినార్ నుంచి ఫలక్‌నుమా వరకు జరిగే మెట్రో రైల్ ఫేజ్-2 కూల్చివేతల్లో హెరిటేజ్ కట్టడాలున్నాయంటూ ఫౌండేషన్ అధ్యక్షులు మహ్మద్ రహీం ఖాన్ హైకోర్టులో వేసిన తన పిల్ ద్వారా వివరించారు. తెలంగాణ హెరిటేజ్ ఆక్ట్ 2017తో పాటు ఆన్‌సెంట్ మానుమెంట్స్ అండ్ ఆర్కియాలజికల్ సైట్స్ అండ్ రిమేన్స్(ఏఎంఏఎస్ఆర్) ఆక్ట్ 1958 ప్రకారం ముందుగా హైకోర్టు



మెట్రో రైలు కోసం పురానీహవేలీ చౌరస్తాలో కొనసాగుతున్న కూల్చివేతలు

గానీ నిపుణుల బృందంతో గానీ సర్వే నిర్వహించి రిపోర్టు వచ్చేంత వరకు ప్రస్తుతం జరుగుతున్న కూల్చి వేతలను నిలిపివేయాలని కోరారు.

- పురానీహవేలీ, అజాఖానా-ఇ-జహ్రా,జమా మసీద్, దారుషిఫా, మొఘల్‌పురా తదితర హెరిటేజ్ కట్టడాలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ వీటి పరిస్థితి ఏమిటంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ రేణుకా యారా తదితరుల డివిజన్ విచారణ చేపట్టి తదుపరి విచారణను ఈనెల 17వ తేదీకి వాయిదా వేసింది.

### ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు..

ఫలక్‌నుమా నుంచి ఎంజీబీఎస్ ద్వారా సికింద్రాబాద్ జేబీఎస్ వరకు ఉండే ఈ మెట్రో కారిడార్ పనుల్లో కేవలం ఫలక్‌నుమా నుంచి ఇమ్లిబన్ వరకు మాత్రమే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పుడు ఫలక్‌నుమా వరకు కాకుండా చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్‌ను పొడిగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎట్టకేలకు పురానీహవేలీ, మీరాలం మండి, దారుషిఫా, ఎతేబార్ చౌక్, శాలిబండ, శంషీర్‌గంజ్ ద్వారా ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులు వేగంగా జరుగనున్నాయి.

- ఇందులో భాగంగా ప్రస్తుతం దారుషిఫా నుంచి మొగల్‌పురాలోని బీబీబజార్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలను తొలగిస్తున్నారు. ప్రస్తుతం పురానీహవేలీ చౌరస్తాలో రోడ్డు విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. చాంద్రాయణగుట్ట నుంచి ఆర్జీఐఏ వరకు మెట్రో కారిడార్ కొనసాగనుంది.

### గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో లాగే పాతబస్తీలో సైతం..

గ్రేటర్‌లోని అన్ని కారిడార్లలో పరుగులు తీసినట్లే.. ఇక నుంచి పాతబస్తీలో కూడా మెట్రో రైలు పరుగులు తీయనుంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన పాతబస్తీ ప్రజల కళ నెరవేరే రోజు వచ్చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటోంది. ఎట్టకేలకు మెట్రో కోసం ఎదురు చూసిన పాతబస్తీ ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2వేల కోట్ల వ్యయంతో ఫలక్‌నుమాలో మెట్రో పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

- సీఎం ఆదేశాల మేరకు పాతబస్తీలో నిర్మించనున్న మెట్రో కోసం రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. ప్రత్యేక తెలంగాణ వచ్చినప్పటి నుంచి రెండు సార్లు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో... ఇక పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్ట్ పనులకు మోక్షం కలుగుతుందని భావించిన పాతబస్తీ ప్రజల ఆశలు నెరవేరుతున్నాయి. ఇక, హెరిటేజ్ కట్టడాల పరిరక్షణ పేరుతో హైకోర్టులో పిల్ దాఖలు కావడంతో అందరి దృష్టి హైకోర్టు పై పడింది.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర రద్దు

జియాగూడ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నెల 19న జరగాల్సిన ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్రను రద్దు చేస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవాదళ్ అధ్యక్షులు జి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.చంద్రకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... 144 ఏళ్ల తర్వాత వచ్చిన మహా కుంభమేళకు పెద్ద ఎత్తున భక్తులు వెళుతున్న నేపథ్యంలో ఈ ఏడాది శోభాయాత్రను విరమించుకున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం యాధావిధిగా శివాజీ మహారాజ్ శోభాయాత్రను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, ఠాకూర్ విశాల్‌సింగ్, వికాస్, సహకార్యదర్శులు జి.ప్రశాంత్, శివరామకృష్ణ, బీజేపీ నాయకుడు గుర్రం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ సునీల్‌కు వినతి పత్రం అందజేస్తున్న సేవాదళ్ ప్రతినిధులు

## చెత్త నిండగానే చెప్పేస్తుంది!

- అందుబాటులోకి స్మార్ట్‌బిన్లు
- చెత్త పేరుకుపోయే చోట మళ్లీ ఏర్పాటు
- నిండుతుండగానే అప్రమత్తం చేసే సెన్సర్లు
- సర్కిల్ వారీగా జీవీపీల గుర్తింపు



చాదర్‌ఘాట్: రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్త సమస్య రోజురోజుకు తీవ్రమవుతుంది. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా రోడ్ల పక్కన చెత్త వేసే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దాలని అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ సర్కిల్-6 మలక్‌పేట పరిధిలో ప్రధాన రహదారుల నుంచి అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీల్లో భారీగా చెత్త పేరుకుపోతుంది. ఈ నేపథ్యంలో తరచూ చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో జీవీపీ చెత్తలేకుండా సమస్య పరిష్కారానికి గతంలో నిషేధించిన డంపర్ బిన్లు (చెత్త డబ్బాలు) మళ్లీ అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

**అడ్వాన్స్ ట్రాకింగ్ సిస్టం విధానంలో**

సర్కిల్-6 సుమారుగా 69 జీవీపీలను గుర్తించి ఈ మేరకు డంపర్ బిన్లు కేటాయించారు. కొత్తగా మంజూరైన ఈ డంపర్ బిన్లు ఒక్కొక్కటి 1100 లీటర్ల సామత్యంతో ఉండగా గార్బేజీ వల్లరబుల్ పాయింట్ వద్ద ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఎక్కడెక్కడ వీటిని ఏర్పాటు చేయాలో అధికారులు, సంబంధిత డీసీ ఏఎంహెచ్‌ఓలకు జాబితా అందజేసారు. అడ్వాన్స్ ట్రాకింగ్ సిస్టం విధానంలో ఈ డస్ట్ బిన్ల పర్యవేక్షణ జరగనున్నాయి.

**69 జీవీపీ వద్ద 111 బిన్ల ఏర్పాటు**

బిన్లలో 70 శాతం చెత్త పడగానే రాపిడ్ సెన్సార్ ద్వారా ఆ రూట్‌లో ఉన్న స్వచ్ఛ ఆటోను అప్రమత్తం చేస్తుంది. దాంతో ఆ రూట్‌లో వెళ్లే వాహనాలు ఈ బిన్లలో నిండుకున్న చెత్తను శుభ్రపరుస్తాయి. దీని ద్వారా బిన్లు నిండే దాకా కాకుండా 30 శాతం ఉండగానే తొలగించడంతో అక్కడ వీధి కుక్కలు చిందరవందర చేసే అవకాశాలు ఉండవని భావిస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-6 జోన్‌లో 69 జీవీపీ వద్ద 111 బిన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ బిన్ల ఏర్పాటు వల్ల సాధ్యమైనంతగా జీవీపీలను తగ్గించాలని ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నారు.

## భోజనంలో నాణ్యత పాటించాలి

**టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్**

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని గిరిజన బాలుర హాస్టల్‌ను ఆదివారం టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్మీనివాస్‌కు పలు సమస్యలను వివరించారు. తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని.. నెలల తరబడి అధికారులకు సూచించిన పట్టించుకోవడం లేదని హాస్టల్ విద్యార్థులు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురవుతున్నారని.. విద్యార్థులకు తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని వివరించారన్నారు. హాస్టల్ భోజనం నాణ్యతగా ఉండే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ అధికారులపై విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో ఉన్న హాస్టళ్లపైన తనిఖీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ నాయకులు రఘు ముదిరాజ్, సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ తదితరులు

## సిటీ కాలేజీలో అత్యుత్తమ విద్యాబోధన

దూద్‌బౌలి: పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ సిటీ కళాశాల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అంజన్ కుమార్ అన్నారు. ప్రభుత్వ సిటీ జూనియర్ కళాశాలలో రాబోయే విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. కళాశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ సిటీ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందాలన్నారు. 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కళాశాలలో ఎంతో మంది ప్రముఖులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ అధికారులు చదువుకున్నారని, వారందరూ ఉన్నతస్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని యువకుడి అనుమానాస్పద మృతి

నాంపల్లి: రైలు పట్టాల పక్కన ఓ గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన హైదరాబాద్ ఆర్‌పీఎఫ్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఓ గుర్తు తెలియని యువకుడి (35) మృతదేహం లింగంపల్లి నల్లగండ్ల బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాల పక్కన పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నీలం రంగు టీ షర్టు, అదే రంగు ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు హైదరాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులను లేదా 040-23202238, 9848349544 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## చికిత్స పొందుతున్న మహిళ మృతి



రమాదేవి మృతదేహం

గౌలిపురా: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతి చెందిన సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి తలాబ్‌కట్టా సిద్దిఖ్‌నగర్ ప్రాంతంలో రమాదేవి (48), నర్సయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ నెల 9న రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న రమాదేవిని అబ్దుల్ కరీం అనే వ్యక్తి ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమాదేవి ఈ నెల 14న మృతి చెందినట్లు వైద్యులు భవానీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ ఎస్ఎస్.హసన్‌కు నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అవార్డు

గోల్కొండ: క్రీడా రంగ అభివృద్ధికి డాక్టర్ సయ్యద్ సిద్దిఖ్ హసన్ చేసిన సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గోల్కొండ సమీపంలోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ – 2025 కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అన్వర్ ఉల్ ఉల్మ్ కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన డాక్టర్ సయ్యద్ సిద్దిఖ్ హసన్ సేవల గుర్తింపుగా నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో వర్ల్డ్ పీస్ సొసైటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఈజోంగ్ యంగ్ బాంబే ఫిజికల్ కల్చరల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి దీపక్ షెడ్డే, వాసవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ.రమణ, ప్రొఫెసర్ జె.ప్రభాకర్ రావు, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ప్రొఫె సర్ ఎల్‌బి.లక్ష్మీకాంత్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణం



రేణుకా ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న ఎన్‌బీఎస్ అధ్యక్షులు మధిర సత్యనారాయణ తదితరులు

జియాగూడ: జియాగూడ ఇమాంపురా రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మ కల్యాణం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా నవభారత సంఘం అధ్యక్షులు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుడు రాంచందర్ ఎల్లమ్మ ఒగ్గు కథను వినిపించారు. కార్యక్రమానికి కార్వాన్ బీజేపీ సీనియర్ నాయకులు కట్ల అశోక్, జి.శివరత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై.జస్వంత్‌కుమార్, ఎం.మహేష్‌బాబు, ఆర్.బాలకిషన్, జి.మహేందర్, సి.బాబు, డిజె.చిన్న, డి.సంతోష్‌కుమార్, డి.లక్ష్మినారాయణ, వి.నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, సి.బాబు, కె.శ్రీకాంత్, ఎం.దర్శన్, ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎన్ఐటీఎస్‌లో టెక్‌స్టార్స్ స్టార్టప్ వీకెండ్

గోల్కొండ: విద్యార్థులతో పాటు వివిధ కంపెనీల ఉద్యోగులు ఒకే చోట చేరి తమ తమ అభిప్రాయాలను మార్చుకోవడం అరుదైన సంఘటన అని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి అన్నారు. ఆదివారం కళాశాలలో టెక్ స్టార్స్ స్టార్టప్ వీకెండ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటువంటి అరుదైన కార్యక్రమానికి తమ కళాశాల వేదికైనందున ఆనందంగా ఉందన్నారు. 13 సంస్థలు పాల్గొన్న ఈ హాకథాన్‌లో తెలంగాణ తో పాటు మొత్తం ఐదు రాష్ట్రాలకు చెందిన 70 మంది పాల్గొన్నారు. వీరిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో పాటు స్టార్టప్ ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్న ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు తమ అధ్యాపకులకు సైతం ఒక కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ స్టార్టప్ ల్యాండ్‌స్కేప్‌లో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఇందులో పాల్గొనేవారి సృజనాత్మక ఆలోచనలకు జీవం పోస్తుందన్నారు. అంతేకాకుండా విలువైన పరిశ్రమలకు ఎన్నో నూతన కోణాలు సూచించడానికి ఇవి దోహదపడుతాయన్నారు. తెలంగాణ ఇన్నోవేషన్ సెల్, సీబీఐటీ, టెక్కి బోర్ట్, ఆగస్ట్ ఫెస్ట్, ఐఐటీ బిలాయి, ఫౌండర్స్ ఫస్ట్ నెట్‌వర్క్, 100 గిగా తదితర సంస్థలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. కార్యక్రమంలో టీజీఐసీ సీఈఓ మేరాజ్ ఫహీం, టెక్ స్టార్స్‌కు చెందిన ఇస్మాయిల్, అటల్ ఇన్‌క్యుబేషన్ సెంటర్‌కు చెందిన డాక్టర్ తాటఖ్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు

## దోర్ సమాజ్ రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీవీర్ శైవ్ కక్కయ్య దోర్ సమాజ్ ప్రతినిధులు

జియాగూడ: రాష్ట్రంలోని శ్రీ వీర్ శైవ్ కక్కయ్య డోర్ సమాజ్ ఎస్సీ రిజర్వేషన్‌లో గ్రూప్-బీ సీరియల్ 19గా కొనసాగించాలని సమాజ్ చైర్మన్ బగవాన్‌దాస్ చొగ్లే, అధ్యక్షులు దత్తు పోల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.... ఎస్సీ గ్రూప్-బీ లో సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, విద్యాపరంగా లబ్ధి పొందామన్నారు. అయితే ఇటీవల ప్రభుత్వం డోర్ సమాజ్ జనాభా సర్వే చేయించి గ్రూప్-సీ లోకి మార్చేందుకు యత్నిస్తుందని, దీని వల్ల తాము అన్ని విధాలుగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో 10 వేలకు పైగా జనాభా ఉందని, అందులో 5 వేల మంది జియాగూడలో ఉంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు సురేష్, ఉమేష్ పాల్గొన్నారు.

## కుస్తీ పోటీలకు ఆహ్వానం

గోల్కొండ: దివంగత గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్ఫూర్తితో యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. దేవర కరుణాకర్ జ్ఞాపకార్థం ఈ ఏడాది శ్రీ ఛత్రపతి శివాజీ కుస్తీపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డి స్టేడియంలో కుస్తీ పోటీల్లో పాల్గొనే మల్లయోధుల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... తాము నిర్వహిస్తున్న ఈ వార్షిక పోటీలకు మంచి స్పందన వస్తున్నదన్నారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నుంచే కాకుండా నగరానికి చెందిన వివిధ అకాడాలు, వ్యాయామ శాలల నుంచి పెద్ద ఎత్తున పహిల్వాన్లు తమ మల్లయోధులను పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్, అశ్విన్ మోదీ పాల్గొన్నారు.



కుస్తీపోటీల క్రీడాకారులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## నీటి సరఫరా విషయంలో రాజీ పడేది లేదు



షేక్‌పేట్ వాటర్‌ఫిల్టర్ బెడ్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నీటి సరఫరా విషయంలో రాజీ పడేది లేదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన జలమండలి ఉన్నతాధికారులతో కలిసి షేక్‌పేట్‌లోని జలమండలి వాటర్ ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ ఫిల్టర్‌బెడ్స్‌కు ప్రతి నిత్యం వస్తున్న నీరు, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... వాటర్ ఫిల్టర్‌బెడ్స్ వద్ద ఉన్న అన్ని పంపులు పనిచేసేలా చూడాలను అధికారులను కోరారు. కొత్త పంపులు అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. రానున్న రంజాన్ మాసంలో మసీదులకు ఉచిత ట్యాంకర్ల ద్వారా నీటిని క్రమం తప్పకుండా పంపాలని, అవసరమైతే ట్యాంకర్ల సంఖ్యను పెంచాలన్నారు. సాంకేతిక కారణాల వల్ల నీటి సరఫరాలో అవాంతరాలు ఎదురైతే అధికారులు అందుబాటులో ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జలమండలి ఆపరేషన్స్ సీజీఎం అమరేందర్ రెడ్డి, జనరల్ మేనేజర్ వినోద్ భార్గవ్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆరూస్ పర్వాన్, వజీఉజ్జ జమాన్ తదితరులు ఉన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

రాజేంద్రనగర్: హసన్‌నగర్ మహమూద్‌నగర్ మసీదు-ఏ-హలీమా సుల్తానాలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో మసీదు ఇమామ్ అబ్దుల్ మోహసిన్ ఉమ్రీ కతీబ్, ఎంఐఎం నాయకులు మహ్మద్ జహంగీర్, ఇక్బాల్ ఖాన్, మహ్మద్ సిద్దిఖ్ అహ్మద్, మీర్జా రిజ్వాన్ బేగ్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

